# మిఠాయి చిట్టి

'మిఠాయి చిట్టి మనకిక లేదు' అనే వార్త అన్ని పత్రికలూ ప్రముఖంగ ఫ్రంట్ పేజీలో ప్రచురించినయ్!

న్యూస్‌పేపర్లో వార్త చదివిన అభిమానులందరూ దిగ్భ్రాంతికి లోనయ్యారు.

మిఠాయిచిట్టి ఎవరో ఎక్కడినుంచి వచ్చిందో ఎవరికి తెలియకపోయినా... నేతి మిఠాయి వ్యాపారం ప్రారంభించి అనతికాలంలోనే అటు పేరు ఇటు డబ్బు ఆర్జించి కీర్తి శిఖరాలను అధిరోహించిన పడతిగ సిటీలో అందరికీ తెలుసు!

స్వీట్స్ ఆరగించే అభిమానులకు మిఠాయి చిట్టి సుపరిచితురాలు.

సిటీలో ఆమె డజను పైగా గల వివిధ ప్రదేశాల్లో నేతి మిఠాయిలు షాప్స్‌కి అధిపతి!

శుచికి శుభ్రతకు... రుచికి వెరైటీకి ఆమె స్వీట్‌షాప్స్ పెట్టింది పేరు. దుకాణంలో అడుగు పెట్టగానే స్వచ్ఛమైన నేతివాసన ఘుమఘుమలు నాసికా పుటాలను తాకి కితకితలు పెడతయ్.

స్వీట్స్ కొనటానికి వచ్చినవారంతా చిట్టి మిఠాయి కొట్ల దగ్గర 'క్యూ' కట్టాల్సిందే! ఒక స్వీటు కొన్నా... కేజీలకొద్దీ ఆర్డరిచ్చినా అందరినీ అత్యంత ఆదరాభిమానాలతో సమదృష్టితో ఆప్యాయంగ చూడటం మిఠాయి చిట్టి ప్రత్యేకత! కస్టమర్స్‌పట్ల మర్యాద మన్నన ప్రదర్శించటంలో ఆమెకు ఎవరూ సాటిరారు!

ఆమె ఇంటి పేరేమిటో ఎవ్వరికీ తెలియదు. కానీ మిఠాయి వ్యాపారంలో చరిత్రను సృష్టించిన ఘనకీర్తి దక్కించుకున్న ఏకైక వనిత కాబట్టి... అభిమానులందరూ 'మిఠాయిచిట్టి' అని ఆప్యాయంగ పిల్చుకోవటం అలవాటైంది.

అది రంగారెడ్డి జిల్లాలో ఓ మారుమూల కుగ్రామం. ఆ గ్రామానికి బస్‌సర్వీసుల్లేవు. రైలు సదుపాయమూ లేదు. ఎడ్లబళ్లమీద పదికిలోమీటర్ల ప్రయాణం చేస్తేగాని సిటీకి రావటానికి బస్ దొరకదు.

యువత సైకిళ్ళమీద మోటార్ బైక్‌లమీద వెళ్ళాల్సిన ప్రాంతానికి పోయి అవసరాలు తీర్చుకుంటూ వుంటారు.

స్వాతంత్ర్యం వొచ్చిన ముప్పై సంవత్సరాలకు ఆ గ్రామంలో ప్రాథమిక పాఠశాల

వెలిసింది. ప్రారంభోత్సవం నాటికి స్కూలు పై కప్పు కూలిపోయింది. అప్పట్నుంచి ఇప్పటివరకు పాఠాలు చెప్పటానికి పంతుళ్లుగాని... వైద్యం చేయటానికి డాక్టర్లు గాని ఆ గ్రామానికి రావటంలేదు.

ఆ వూళ్లో చదువొచ్చినోళ్ళేలేరు. పేపరు చదవగల మొగాడు పుట్టలేదింకా! లావాదేవీలన్నీ వేలిముద్రలతోనే నడుస్తుంటయ్ అక్కడ.

గ్రామంలో మగపిల్లలు అయిదేళ్ళు వచ్చేదాకా గోచీలు పెట్టుకునే అలవాటులేదు. ఆ తర్వాత పన్నెండేళ్ళ వరకు గోచీలు... అటుపైన నిక్కరో... పంచో కడుతూ వుండటం ఇప్పటికీ కన్పిస్తుంది.

చదువులేకపోవటంతో మగపిల్లలు గొడ్లను మేపుకు కాలక్షేపం చేయటమో... చెట్లంట చెరువులవెంట షికార్లు కొట్టటమో చేస్తుంటారు.

పదేళ్ళొచ్చేదాకా ఆడపిల్లయితే గౌనేసుకుంటుంది. పెద్దమనిషి అయినప్పటినుండి పెళ్ళి అయ్యేవరకు లంగా జాకెట్టు, ఆ తర్వాత పెళ్ళి జరిగిన నాటినుంచి చీర సింగారించటం అక్కడి రివాజు.

పదహారేళ్ళ రాజయ్యకి పన్నెండేళ్ళ చిట్టెమ్మతో పెళ్ళయింది! గొడ్లను మేపుకు రావటం... వాటిని వూరి చెరువులో గడ్డితో శుభ్రం చేయటం... చద్ది బువ్వ తిని సూర్యాస్తమయానికి వాటిని ఇంటికి తోలుకురావటం రాజయ్య దినచర్య.

రాజయ్య తండ్రి భద్రం తనకున్న నాలుగు ఎకరాల పొలాన్ని దున్నుకు బతుకుతూంటాడు. పనిపడ్డప్పుడు కొడుకుని వెంట పెట్టుకుని పొలంపన్లకి తీసుకెడుతుంటాడు.

చిట్టి పుట్టంగానే... కాన్పు కష్టమై తల్లి చనిపోవటంతో... ఒక్కగానొక్క చెల్లెలు కూతుర్ని అక్కున చేర్చుకుని పెంచి పెద్దచేసి మేనకోడలును కొడుక్కు చేసుకుని ఆ పిల్లదాన్ని ఆదుకున్నాడు భద్రం.

చిట్టి కడుపున పడగానే... పెళ్ళాంతోగాని అటు బావ భద్రంతోగానీ చెప్పకుండా ఊరొదిలి ఎటో వెళ్ళిపోయాడు మొగుడు. అన్నల్లో కలిసిపోయాడని కొందరు... చచ్చిపోయి వుంటాడని మరికొందరు రకరకాలుగ చెప్పుకున్నారు.

పెళ్ళి అయిన ఆర్నెళ్ళకి చిట్టి పుష్పవతి అయింది. ఓ మంచి రోజు చూచి రాజయ్యని చిట్టిని ఏకం చేసారు. నాలుగేళ్ళయినా కాపురం చేసిందోలేదో రాత్రి సమయంలో

పొలంనుంచి వస్తూండగ పాముకాటుకి గురైన రాజయ్యకి నూరేళ్ళు నిండిపోయినయ్.

పదహారేళ్ళ వయసులోనే చిట్టి ముండమోసింది!

దరిద్రపుగొట్టుది... పుట్టగానే తల్లిని పొట్టన పెట్టుకుంది... పెళ్ళి అయిన నాలుగేళ్ళకే మొగుడినీ మింగేసింది... అంటూ రోజూ మేనమామ చిట్టిని తిట్టిపోయటం చూస్తూ వలవలా ఏడుస్తున్న కోడలు చిట్టిని కౌగలించుకుని ఓదార్చేది యాదమ్మత్త!

'తిట్టమాకయ్యా... మొగుడుపోయి అది బాధపడుతావుంటే... నువ్వేంది తిడతావ్? వచ్చిన కష్టానికి పసిది అదిమాత్రం ఏ చేసుద్ది?...' కోడలు చిట్టిని వెనకేసుకొచ్చేది అత్త యాదమ్మ.

అత్తమ్మ మంచిదే అయినా మామ పోరు... ఆరడి తప్పలేదు చిట్టికి.

సచ్చిపోయిన కొడుకు గుర్తుకురావటంతో ఒకరోజు పొలంనుంచి వచ్చి వెల్లకిలా మంచంమీద పడుకున్న భద్రం చివాలున లేచి 'ఎల్లిపోవే ముదనష్టపుదానా... యాడికైనా ఎల్లిపో!- నీ ముండమోపి ముఖం నాకు చూపించద్దు' అంటూ తోక తొక్కిన తాచులాగా కస్సుమన్నాడు.

'సిన్నది... పైగా వయసులో వున్న దాన్ని యాడికెల్లమంటావయ్యా?- దాన్నొక్కదాన్నే వంటరిగా వుండమనటం దరమం కాదయ్యా...' మొగుడికి నచ్చచెప్పబోయింది యాదమ్మ.

'అత్తమ్మా! నే నీడవుంటం మామ కిట్టంలేదు. అందుకే నేను విడిగా వుంటాను. నా పొట్ట నేను పోసుకు బతగ్గలను...' చిట్టిలో రోషం తన్నుకొచ్చి అంది.

రెండు రోజుల తర్వాత మొగుడికి తెలియకుండా డబ్బిచ్చి... కొంత సామాను ఇచ్చి... బియ్యం, పప్పు, ఉప్పు ఇచ్చి ఓ పాకలో చిట్టి చేత వేరు కాపురంపెట్టించింది అత్త యాదమ్మ.

ఇడ్లీ... దోసె... ఉదయం పూట... మధ్యాహ్నం అరిసెలో... లడ్డో... జాంగ్రీనో చేసి జంతిక లొత్తి వాటిని అమ్మి వ్యాపారం సాగించింది చిట్టి.

ఒకటి రెండు నెలల్లో చిట్టెమ్మ చేసే వ్యాపారానికి డిమేండు పెరిగింది. లాభం బాగానే వస్తోంది.

అప్పుడప్పుడు యాదమ్మ వచ్చి చిట్టికి తోడుగ పడుకుని తెల్లారి వెళ్ళిపోతూండేది.

ఎవ్వరినీ నమ్మొద్దనీ... ఎవ్వరికీ అప్పులివ్వవద్దనీ హిత వచనాలు పలికేది యాదమ్మ.

చిట్టి చేస్తున్న బేరం వృద్ధిలో కొచ్చి ఆదాయం పెరిగింది.

ఆ గ్రామంలో పెద్దాసామి చౌదరి గారే! పాతికెకరాల మాగాణి... అయిదెకరాల మెట్ట వుందాయనకు. సొంత వ్యవసాయం... చేతినిండా డబ్బు... గ్రామంలో గౌరవం వున్న వ్యక్తి పెద్ద చౌదరి.

అతనికి ఒక్కగానొక్క తమ్ముడు చిన్న చౌదరి. చదువులేకపోయినా తెలివుంది గోవిందుకి. ట్రాక్టర్‌తో పొలం దున్నగలడు. కూలోళ్లతో వంచిన నడుము ఎత్తకుండా పని చేయించగలడు.

గోవిందుకి ఇరవైయ్యేళ్ళ వయసులోనే పెళ్ళి చేసాడు పెద్ద చౌదరి. కానీ గోవిందు ప్రాణానికి సుఖం లేకుండాపోయింది.

సిటీలో పుట్టి పెరిగి చదువుకున్న పిల్ల కావటంతో పల్లెటూరొచ్చి గోవిందుతో కాపురం చేయటానికి ఇష్టపడ్లేదు. ఈ విషయమై ఇరుపక్షాలవారే ఘర్షణపడ్డారు.

కాపురం చేయటానికి ఇష్టపడని ఆడది తన పెళ్ళమేకాదని భీష్మించుకున్నాడు గోవిందు. ఆ విధంగా పంతాలకు... పట్టుదలలకు పోయి బ్రతుకు బండలు చేసుకున్నాడు చిన్న చౌదరి గోవిందు.

పనీపాట లేదనుకున్నప్పుడు సిటీలో కెళ్ళి సినిమాలు చూసొస్తుంటాడు. మెడలో పలుపు తాడంత బంగారు గొలుసు. ముంజేతికి బ్రాస్‌లెట్... నాలుగు వేళ్ళకీ ఉంగరాలు... చేతిలో సెల్లు... చేతికింద రాయలెన్‌ఫీల్డ్ బైక్... గోవిందు మహాదర్జాగ స్టైల్‌గా వుంటాడు.

సిటీకెళ్ళినా పొరపాటున కూడా మామగారింటికెళ్లడు. భార్యని కలవాలనుకోడు. అంత పట్టుదల ఉన్నవాడు గోవిందు.

చిట్టి చేస్తున్న వ్యాపార విషయం గోవిందు దృష్టికొచ్చింది. ఎర్రగ బుర్రగ వయసులో మిసమిసలాడుతున్న చిట్టిని వల్లో వేసుకోవాలని విశ్వప్రయత్నం చేయసాగాడు గోవిందు.

'ఇయ్యాళేం చేసావుస్పెసలు?-' కొట్టు దగ్గర మొటారు బైక్ ఆపి చిట్టిని అడిగేడు గోవిందు.

'జాంగిరీ... బూరెలు సేసినా' చెప్పింది చిట్టి.

'అదొకటి ఇదొకటి ఇవ్వు...'

'ఇంటికా... ఈడ తింటానికా?'

'ఈడనే తింటా'

బాదం ఆకులో రెండు స్వీట్లూ పెట్టి చేతికి అందించింది.

"బెమ్మాణ్ణంగున్నాయే! సిటీలో కూడా వుండవ్ ఇంత రుచిగా... అవునూ ఎంత అవి?-" ధర అడిగేడు గోవిందు.

'ఎంతోనా ఒక్కోటి రెండు రూపాయలే...'

యాభై నోటు జేబులోంచి తీసి 'నీయమ్మ చిల్లర లేకపోయనే...' గొణిగేడు.

'సర్లే... రేపిస్తాలే...' గోవిందే మళ్ళీ అన్నాడు.

'అదేం కుదర్దు. అరువు బేరంలేదు. నిక్కచ్చిగా అంది.

'అట్టనా... అయితే యాభైనోటుంచుకో... చిల్లర రేపివ్వు...' చిట్టి సమాధానం కోసం ఎదురుచూడకుండానే బండి స్టార్ట్ చేసి వెళ్ళిపోయాడు గోవిందు.

గోవిందుకి ఆ రాత్రంతా నిద్దర్లేదు. కుర్ర సినిమా హీరోయిన్‌కి మల్లే మిసమిసలాడుతున్న చిట్టే కళ్ళల్లో మెదులుతోంది. ఎట్లాగైనా చిట్టిని లైన్లో పెట్టాల! ముండమోపిదైనా మేలిమి బంగారంలాగ మెరిసిపోతోంది. గులాబ్‌జామ్‌కి మల్లే ఉంది! బందరు లడ్డూలాగుంది అని లొట్టలేసుకుంటూ నిద్రలోకి వొరిగిపోయాడు.

'ఇదిగో సిన్నసౌదరిగోరూ... మీ డబ్బు పట్టుకెళ్లండి...' ఇంటి ముందుగా వెడుతూన్న గోవిందుకి కేకేసి మరీ చెప్పింది చిట్టి.

'మల్లొత్తాగా... నీ కాడనే వుంచు...' తుర్రుమన్నాడు బండిమీద.

గోవిందుకు మనసులో చిట్టిని పెళ్ళి చేసుకోవాలనే ఆరాటం మొదలైంది. అడిగితే వొప్పుకుంటుందో లేదోనే జంకు మరో వేపు.

అరోజు రాత్రి సామాన్లు సర్ది తలుపేసుకోబోతుండగా చీకట్లో గోవిందు ఇంట్లోకి దూరి చిట్టిని అమాంతం వాటేసుకుని ముద్దులు పెట్టుకున్నాడు.

'నిన్ను చేసుకుంటానే చిట్టీ' అన్నాడు.

ఊహించని పరిణామానికి బిత్తరపోయింది చిట్టి. విదిలించుకుని దూరంగ జరిగింది.

'మన పెళ్ళి ముచ్చట చెప్పటానికే వచ్చా! నేను సెడ్డోణ్ని కాదే చిట్టీ! నిన్ను నా కంట్లో పాపలాగ చూసుకుంటాను. నెత్తిన పెట్టుకుంటా... తర్వాత నీ యిష్టం...' అని చెప్పి రివ్వున బైటికెళ్ళిపోయాడు.

ఆ రాత్రి చిట్టికి నిద్రరాలేదు. తనూ వయసులో వుంది. ఉప్పు కారం తింటోంది. గోవిందు మంచోడే... కాకపోతే అత్తమ్మ మామకి తెలిస్తే వూరుకోరు. చంపేస్తారు. ఆలోచించి ఓ నిర్ణయానికి వచ్చిన దానికి మల్లే గట్టిగ శ్వాస పీల్చి వదిలి కళ్ళు మూసుకుని

నిద్రలోకి జారబడ్డది.

మూడోకంటికి తెలీకుండా ఇద్దరూ సిటీకొచ్చారు. దేవుడి గుడిలో తాళి కట్టి పెళ్ళి చేసుకున్నాడు.

చిట్టితో సిటీలో కాపురం పెట్టాడు గోవిందు.

ఏదైనా వ్యాపారం చేయాలన్పించటంతో గోవిందు తన మనసులో ఉన్న ఆలోచన చిట్టితో చెప్పాడు.

'ఇంకోటి... ఇంకోటి దేనికి? మనకు మిఠాయిలు చేయటం బాగా వచ్చు కదా?- నేతి మిఠాయిలు చేసి అమ్ముదాం...'

'నీ ఆలోచన బాగానే వుంది కానీ నువ్వొక్కదానివల్ల అవుతుందాని?...'

'చేతికింద ఇద్దరు మనుషుల్ని పెట్టుకుందాం!- ముందు తోపుడుబళ్ళమీద పెట్టి సిటీలో అమ్మిద్దాం! ఇంటికాడ ఇరుగుపొరుగుకి కూడా చెప్దాం...'

'సెభాస్!... నీయమ్మ... తెలివంటే నీదేనే!... నాకేం తెలీదు. నువ్వు ఎట్టాసెపితే నేనట్టా నడుచుకుంటా...' సంబరపడ్డాడు గోవిందు.

అట్లా మొదలైన స్వీట్ల వ్యాపారం ఏడాది తిరిగేసరికి సిటీలో చిట్టి తయారుచేస్తున్న మిఠాయి గురించి అందరికీ తెల్సిపోయింది.

రెండు సెంటర్లు చూచి చిట్టి గోవిందులు మిఠాయి దుకాణాలు ఓపెన్ చేసారు. వ్యాపారం లాభాలబాటలో నడుస్తోంది.

స్వచ్ఛమైన నేతి మిఠాయిలు కోసం జనం ఎగబడటం మొదలైంది. పరిశుభ్రతకు క్వాలిటీకి చిట్టి స్వీట్స్ పెట్టింది పేరుగ సిటీ అంతా పాకిపోయింది.

రెండు షాపులు... ఆరైనయ్... కొద్ది కాలానికే డజను షాపులకు పైగా వెలిసినయ్.

కార్లలో తిరగటం... సెల్‌ఫోన్లో మాట్లాడి ఆర్డర్స్ స్వీకరించగల లెవెల్‌కొచ్చింది చిట్టి నేతిమిఠాయిల వ్యాపారం.

స్వంత బంగళా కట్టించుకునే స్థాయికి ఎదిగింది బిజినెస్.

గోవిందు కేవలం ఉత్సవ విగ్రహమే! చక్రం తిప్పేదంతా చిట్టెమ్మే! ఇప్పుడంతా ఆమెని 'మిఠాయి చిట్టి' అని పిలుస్తున్నారు.

'చిట్టీ నువ్వు నిజంగా అదృష్టవంతురాలివే...' అంతరాత్మ ఆమె భుజం తట్టింది. గోవిందును కట్టుకున్నాక నీ దశ తిరిగిందే...' మనసు ప్రశంసిస్తోంది.

దేవుడులాంటి భర్త... లక్షల్లో వ్యాపారం... అనుభవించని సుఖం ఆనందం అంటూ ఏమీలేదు. ఈ జన్మకిది చాలనుకుని మనసులోనే మురుస్తోంది చిట్టి!

మిఠాయిచిట్టి ఆకస్మిక మరణానికి ఎందరో అభిమానులు ఫోన్ చేస్తున్నారు. అందరికీ ఒకే జవాబు... 'చిట్టి నిద్రలోనే తుదిశ్వాస విడిచిన అదృష్టవంతురాలు' అని పని వొత్తిడివల్ల తీవ్రమైన గుండెపోటు రావటమే ఆమె మృత్యువుకు ముఖ్యకారణమని డాక్టర్ల నిర్ధారించి చెప్పాడు.

తనకు తోడు నీడగా వుంటూ తనలో సగభాగమైన చిట్టి పోవటంతో గోవిందు మెంటల్‌షాక్‌కి గురైనాడు. ఏమీతోచటంలేదు. కాలు చేయి ఆడకుండా ఉంది. దుఃఖం పెల్లుబికి వస్తోంది.

తానొక్కడే అన్నీ తానే అయి సమర్థించుకోవాలంటే చేతకాకుండా వుంది.

మిఠాయిచిట్టి ఆకస్మిక మరణానికి సిటీలో వున్న స్వీట్‌షాప్స్ అన్నీ మూసేసి తమ అభిమాన నేస్తమైన ఆమెపట్ల తమకు గల గౌరవాన్ని తెలుపుకున్నారు.

తమకింద పని చేసేవారంతా విచారవదనంతో వున్న ఓనరు గోవిందుకు ధైర్యం చెప్తున్నారు.

మిఠాయిచిట్టి భౌతికకాయాన్ని పోర్టికోలో వేసిన బల్లలమీద సందర్శకుల వీలుకోసం వుంచటం జరిగింది.

తమ ప్రియతమ మృతురాలికి శ్రద్ధాంజలి ఘటించి తుదివీడ్కోలు చెప్పుకోవాలని పూలగుచ్ఛాలతో విషాదవదనంతో అనేకులు రావటం మొదలైంది.

పోలీస్ బందోబస్తు నడుమ మిఠాయిచిట్టి భౌతికకాయాన్ని దహన సంస్కారాలకోసం స్మశానవాటికకు శోకతప్త హృదయాలతో తరలించటం జరిగింది!

మిఠాయిచిట్టిగా ప్రసిద్ధిగాంచిన గోవిందు భార్య చిట్టి, తరలిరాని లోకాలకు వెళ్ళిపోయినా ఆమె అభిమానుల మనస్సులో ఆమె పట్ల గౌరవం శాశ్వతంగ నిల్చిపోయింది.

- సమాప్తం -